క్లుప్తంగా

ప్రజలందరిపై పైడిమాంబ ఆశీస్సులు



కుటుంబ సభ్యులతో అమ్మ దర్శనానికి వచ్చిన యనమండ్ర

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా శ్రీ విద్యాపీఠం వ్యవస్థాపకుడు యనమండ్ర వేణుగోపాలశాస్త్రి అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని, ఆమె కరుణా కటాక్షాలతో ప్రజలందరూ చల్లగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులున్నారు.

బంగారమ్మ పండుగను విజయవంతం చేయండి



కొండకరకాంలో పెద్దలతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పరిధిలోని కొండకరకాంలో గురువారం జరగనున్న బంగారమ్మ పండుగను విజయవంతం చేయాలని రూరల్ సీఐ లక్ష్మణరావు కోరారు. ఈమేరకు గ్రామంలో గ్రామపెద్దలు, కమిటీ ప్రతినిధులతో బుధవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమష్టి కృషితో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ



శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని పెదపూతికవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బూరాడ శ్రీనివాసరావు గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ఆ గ్రామానికి వెళ్లి శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, స్థానిక నాయకుడు ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

ముమ్మరంగా శానిటేషన్ పనులు

గజపతినగరం: మండల కేంద్రంలోని పలు వీధుల్లో బుధవారం శానిటేషన్ పనులు చేపట్టారు. ఆస్పత్రి రోడ్డు, బుర్దివీధి, తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. కాలువల్లో పూడికలు తొలగించి సుదూర ప్రాంతాలకు తరలించారు. దోమలు, ఈగల నివారణకు రసాయన మందులు పిచికారీ చేశారు. పంచాయతీ సెక్రటరీ జనార్దనరావు పనులను పర్యవేక్షించారు.

మూడు అడుగుల ఎత్తులో అరటిగెల ..



అరటిమొక్క కాండం వద్ద కాసిన గెల

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన వేచలపు రామకృష్ణ తన కల్లంలో వేసిన అరటి మొక్క మూడు అడుగుల ఎత్తులోనే గెలవేయటం పలువురిని ఆకట్టుకుంటోంది. అరటిమొక్క సుమారు 8 అడుగుల ఎత్తు వరకు పెరిగింది. అయితే మొక్క మొదలు వద్ద మూడు అడుగుల ఎత్తులో కాండంలోంచి అరటిగెల రావడంతో చుట్టుపక్కల వారు దాన్ని ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

సంక్రాంతిలోగా పనులు పూర్తి

• ఎమ్మెల్యే నాగమాధవి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కలెక్టర్ బీఆర్ అంబేద్కర్, తదితరులు

డెంకాడ: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సంక్రాంతిలోగా పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని పెదతాడివాడలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులకు కలెక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 24 కోట్ల రూపాయలతో 682 పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పెదతాడివాడలో 5 పనులను 96 లక్షల రూపాయలతో చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో నీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. 24 గంటలు రక్షిత తాగునీరు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి పల్లె అందంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భావిస్తున్నారని, వారి ఆశయాలకు తగ్గట్టుగా గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కింద శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నామన్నారు.

జిల్లాలో రూ. 182 కోట్లతో పనులు..

కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు జిల్లాలో 182 కోట్ల రూపాయలతో 2,705 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పల్లె పండుగలో శంకుస్థాపనలు చేసిన పనులను సంక్రాంతి లోపల పూర్తి చేసి సంక్రాంతికి ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్ర శేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు గాదిపల్లి రమేష్, పొంతపల్లి జగన్నాథరావు, డ్వామా పీడీ సందీప్, మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, ఎంపీడీఓ భవానీ, తహసీల్దార్ పద్మావతి, పలువురు అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు సమస్యల్లేకుండా చూడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

• ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: పంట నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తిచేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరన్నారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు బాగా పెరిగాయని, వీటిని తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా మంజూరు కాబోయే పథకాలను అధికారులు గ్రామాల్లోని ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. దీంతో అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ భవానీ, తహసీల్దార్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

• ఎమ్మెల్యే లోకం నాగమాధవి



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమధవి, తదితరులు

పూసపాటిరేగ : గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని కుమిలిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పల్లె పండుగ పేరిట అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఆమెతో పాటు ఏపీ మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కె. బంగార్రాజు, ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ టి. గోవింద, సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పడాల ప్రశాంతి, ప్రజాప్రతినిధులు దల్లి ముత్యాలురెడ్డి, మద్దిల మురళి, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్ పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: మధుపాడలో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్థానిక మహిళలు

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పినతరిమి, మధుపాడ, జోగిరాజుపేట గ్రామాల్లో ఎంపీడీఓ రామకృష్ణరాజు ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లం అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తం, నాయకులు నల్లం శ్రీనివాసరావు, మత్స శ్రీనివాసరావు, బొంతు రమణ, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



చదురుగుడి వద్ద తోలుబొమ్మలాట ప్రదర్శన

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా వనంగుడి, చదురుగుడి ఆలయాల ఆవరణలో బుధవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. చదురుగుడి వద్ద కాకినాడ మాధవపట్నంనకు చెందిన టి.పవన్‌కుమార్ తోలుబొమ్మలాట... శ్రీ వెంకటేశ్వర భక్తమండలి ఎస్ఎల్.ప్రసాదరావు బృందం ఆలపించిన భక్తి గీతాలు.. వనంగుడి ఆవరణలో వరలక్ష్మీ త్యాగరాజ సంగీత నృత్యకళానికేతన్ ఎం.లక్ష్మీరామదాసు బృందం చేసిన నృత్యప్రదర్శన, కె.విద్యాసాగర్ ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. అనంతరం కళాకారులను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఘనంగా సత్కరించారు.

మహిళలను ఆకట్టుకుంటున్న డ్వాక్రాబజార్



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న డ్వాక్రా బజార్


• ఐదు రోజుల్లో రూ. 5.58 కోట్ల వ్యాపారం

విజయనగరం అర్బన్: స్థానిక ట్యాంక్‌బండ్ రోడ్‌లో ఏర్పాటుచేసిన డ్వాక్రా బజార్ మహిళలను ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పొదుపు సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ముఖ్యంగా జూట్‌తో తయారు చేసిన ఉత్పత్తులు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు చెందిన మహిళలు వెదురుతో తయారు చేసిన పూలకుండీలు, మిల్లెట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఎటుచూసినా ఆకర్షించే బొమ్మలు, వివిధ రకాల పచ్చళ్లు, జ్యూయలరీ వస్తువులు, అటవీ ఉత్పత్తులు, వెదురు వస్తువులు, ఏటుకొప్పాక బొమ్మలు, ఆత్రేయపురం పూత రేకులు, మాడుగుల హల్వా, కాకినాడ కాజా, హెర్బల్ ప్రొడక్ట్స్, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు ప్రదర్శనలో ఉంచారు. వస్త్రాలు, గృహోపకరణాల కోసం కాళ్లరిగేలా షాపుల చుట్టూ తిరగకుండా ఒకేదగ్గర వందల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉండడంతో సందర్శకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అరుదుగా దొరికే వస్తువులు..

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చేనేత వస్త్రాలు, బొమ్మలు, ఆభరణాలు విజయనగరం వాసులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ.. మహిళల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించడానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన ఈ బజారులో ఐదు రోజుల్లో రూ.5.58 కోట్ల వ్యాపారం జరిగిందన్నారు.

• ప్రకృతి గీచిన చిత్రం...



ఆకాశంలో వెండి మబ్బులు.. నేలపై పచ్చని వరిపైరు.. మనసును ఉల్లాసపరిచే ఈ దృశ్యం మండలంలోని గొడిపాలెంలో బుధవారం ఆవిష్కృతమైంది. అటువైపుగా వెళ్లేవారు ఈ సుందర దృశ్యాన్ని సెల్ ఫోన్లలో బంధించారు. - డెంకాడ

పాడిరైతులను ఆదుకోవాలి



పాడిరైతుల సదస్సు గోడపత్రికలు విడుదల చేస్తున్న రైతు సంఘు నాయకులు

శృంగవరపుకోట: బీజేపీ ప్రభుత్వం పాడి ఉత్పత్తులపై జీఎస్టీ విధించడం, సహకార రంగ డెయిరీలను దెబ్బతీయడం, పాల ఉత్పత్తుల తయారీ పరికరాలపై పన్నులు పెంపు వల్ల రైతులు నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం వద్ద బుధవారం ఏపీ రైతు సంఘం నేతృత్వంలో గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంతో పాటు పాడిపరిశ్రమపై ఆధారపడి అనేక మంది జీవనోపాధి పొందుతున్నారని, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఆయా రంగాలు పూర్తిగా కుదేలయ్యాయన్నారు. పాడిరైతుల వద్ద ఆవుపాలు రూ.34లు, గేదెపాలు రూ.39.50లు కొని మార్కెట్‌లో రూ.56లకు అమ్ముకుంటున్నారన్నారు. పాడి రైతులకు ప్రోత్సాహక ధర లీటరుకు రూ.8లు చెల్లించాలని, సహకార రంగ డెయిరీలను ప్రారంభించాలని కోరారు. పాడి రైతులను ఆదుకునే దిశగా అక్టోబర్ 18న ఉదయం 10గంటలకు జామిలో బూసర్ల రమణారావు కళ్యాణ మండపంలో జరిగే పాడిరైతులు సదస్సుకు రైతులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సి.హెచ్.ముత్యాలు, కర్రి గణేష్, పి.అప్పలసత్యం, కొమ్మినేని లక్ష్మి, కె.లక్ష్మి, కె.నాయుడు, కృష్ణమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అందని వైద్యం

• ఇంటింటికీ ఆరోగ్యం అందించండి
• కూటమి ప్రభుత్వానికి జెడ్పీ చైర్మన్ హితవు



గుర్ల జెడ్పీ హైస్కూల్‌లో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు



డయేరియా రోగులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: పల్లెల్లో పండగ కాదు ఇంటింటికీ ఆరోగ్యం అందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ మేరకు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డయేరియా వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి, రోగులను పరామర్శించారు. రోగులకు ఆలసత్వం లేకుండా వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సకాలంలో వైద్యం అందడం లేదని అసహనం వెలిబుచ్చారు. డయేరియాతో ఐదుగురు మృతి చెందిన దానికి కారణం ప్రభుత్వమే అని మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పల్లెల్లో పూర్తిగా పారిశుద్యం లోపించిందని ఆరోపించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు అనారోగ్యానికి గురైతే ఇంటికి వెళ్లి వైద్యం అందించామని, అలాంటి పరిస్థితి కూటమి ప్రభుత్వంలో కానరాదన్నారు. డయేరియా రోగులను సందర్శించిన వారిలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు ఉన్నారు.

పంచాయతీ తీర్మానం లేకుండా పనులు మంజూరు చేయొద్దు

• మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్, పీఆర్ ఏఈ హరికృష్ణకు పలు సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం తప్పనిసరని, తీర్మానం లేకుండా ఎట్టిపరిస్థితిలో పనులు మంజూరు చేయొద్దని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్థానిక జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని వివిధ శాఖల పగతి నివేదికలపై సమీక్షించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఇన్‌చార్జ్ ఏపీఓ ఎ.నరేంద్రకుమార్, పంచాయతీరాజ్ ఏఈ హరికృష్ణ వివరిస్తుండగా జెడ్పీ చైర్మన్ కలుగజేసుకుని గోశాలల మంజూరు ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. ఇంతవరకూ పశువైద్యాధికారి తమకు ఎలాంటి ఎస్టిమేట్లు అందించలేదని ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ ఆయనకు తెలియజేశారు. వ్యవసాయశాఖపై చర్చ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న ప్రతీ పంట ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని, ప్రతీ రైతు ఈకేవైసీ పూర్తిచేసేలా చూడాలని వ్యవసాయశాఖ అధికారి శ్రావణితేజకు జెడ్పీ చైర్మన్ సూచించారు. వైద్యశాఖపై చర్చ సందర్భంగా గ్రామాల్లో సీజనల్ జ్వరాలు, డయోరియా వంటి అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని మెరకముడిదాం, గర్భాం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కోతలు మొదలయ్యాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మండిపడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌ఈబీ ఏఈ రమేష్‌కు సూచించారు. తహసీల్దార్ అజురఫీజాన్ రెవెన్యూ శాఖకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తుండగా పలువురు సభ్యులు కలుగజేసుకుని ఆన్‌లైన్‌లో 1బీలు రావడం లేదని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే పూర్తియిన గ్రామాల్లో ఆన్‌లైన్ 1బీలను ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జె.భాస్కరరావు, వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు, అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

చీపురుపల్లి రూరల్(గరివిడి): వరిలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి శైలజ సూచించారు. గరివిడి మండలం అర్థమూరు, కోనూరు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది వరి పంటలో ఎక్కువగా పొడ తెగులు(కుళ్లతెగులు) కన్పిస్తోందన్నారు. వరి దుబ్బు కింద నుంచి మీద వరుకు రంగు మారి కుళ్లినట్లు కనిపిస్తే పొడతెగులుగా గుర్తించాలన్నారు. ఈ తెగులు నివారణకు హెక్సాకొనిజాల్ 20 ఎం.ఎల్ రసాయన మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. పంట చివర దశలో పొటాష్‌ను వినియోగిస్తే దిగుబడి పెరగడంతో పాటు తెగుళ్లు వ్యాపించే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురినాయుడు, రైతులు పాల్గొన్నారు.